సాక్షి విజయనగరం

గురువారం । 17 । ఆగస్టు । 2023



ముఖ్యమంత్రిది మేలైన పాలన

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మేలైన పాలన అందిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు.

- 8లో



దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్ ఇండియా లక్ష్యం

దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్ఇండియా ఉద్దేశమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుదర్శన్ ఆచార్య పేర్కొన్నారు.

- 8లో



పీహెచ్‌సీల పోటీ

నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాష్) సర్టిఫికెట్ కోసం జిల్లాలోని పీహెచ్‌సీలు పోటీపడుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

8వేల మెట్రిక్ టన్నుల రొయ్యల ఎగుమతి

- నాస్కా మేనేజర్ రాము



కోనాడలో ఆక్వారైతులకు అవగాహన కల్పిస్తున్న నాస్కా మేనేజర్ రాము, తదితరులు

పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఏటా 8 వేల మెట్రిక్ టన్నుల రొయ్యలు ఎగుమతి చేయడమే లక్ష్యంగా సాగును ప్రోత్సహిస్తున్నామని ఉత్తరాంధ్ర జిల్లాల నాస్కా (నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వా కల్చర్) మేనేజర్ పి.రాము అన్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామమైన కోనాడలో ఆక్వాచెరువులను బుధవారం పరిశీలించారు. రొయ్యల పెంపకంపై రైతులకు పలు సూచనలు చేశారు. సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కొన్నిచోట్ల రైతులకు అవగాహన లేకపోవడంతో రొయ్యలసాగు నష్టాలను తెచ్చిపెడుతోందన్నారు. రొయ్య పిల్లలను చెరువుల్లో వేసేముందు ప్లవకాలును అభివృద్ధి చేయాలని సూచించారు. ఆక్వా చెరువులో నీరుపెట్టిన తరువాత హేచరీల నుంచి తెచ్చిన సీడ్‌ను నేరుగా వేయకూడదన్నారు. సీడ్‌కు పీసీఆర్ పరీక్షలు చేసి వైరస్ ఉందో లేదో గుర్తించాలని సూచించారు. రొయ్య పిల్లలకు తొలిదశలో సహజమైన ఆహారాన్ని అందించాలన్నారు. అధిక మోతాదులో ఆహారం వేస్తే చెరువుల అడుగుభాగంలోకి చేరి విషపూరితంగా మారి రొయ్యలు చనిపోయే అవకాశం ఉందని రైతులకు హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు ఎల్లాజీ, మాజీ సర్పంచ్ దంగా భూలోక, మోడల్ ఆక్వారైతు చింతలపాటి శ్రీనివాసరాజుతో పాటు పలువురు ఆక్వా రైతులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం



ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలతో ఆనందం వ్యక్తంచేస్తున్న తంగి నిగుడ్డివలస వాసులు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మా లాంటి వలసజీవులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ఠంచన్‌గా అందుతున్నాయని నేరళ్లవలస సచివాలయం పరిధిలోని తంగినిగుడ్డివలస గిరిజనులు పాముల లక్ష్మణరావు, మర్రి శ్రీను, వంతల సూరయ్య, మర్రి లక్ష్మణ, జె.రమేష్, వై.సూరన్న తెలిపారు. సుమారు 20 ఏళ్ల కిందట ఒడిశా రాష్ట్రం నుంచి వలస వచ్చామని, నాలుగేళ్లుగా పథకాలు అందుతుండడంతో ఆర్థికోన్నతి చెందుతున్నామన్నారు. వలంటీర్లే వచ్చి పింఛన్లు, రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్టు వెల్లడించారు. మా పిల్లల చదువులకు ఆర్థిక అండ దొరికిందంటూ సంతోషం వ్యక్తంచేశారు. సీఎం మేలును మరచిపోలేమన్నారు.

చురుగ్గా ఓటరు సర్వే



ఇంటింట ఓటర్ల సర్వేచేస్తున్న బీఎల్‌ఓలు

- ఇంటి నంబర్‌లేని 17,166 ఓటర్ల గుర్తింపు
- అదనంగా ఆన్‌లైన్ నమోదు ఓట్లు 83,853పై సర్వే
- 15 రోజుల సర్వేలో ఎక్కడా కనిపించని దొంగఓటు
- జిల్లాలో ఓటర్లు 15,17,589

విజయనగరం అర్బన్: జిల్లాలో ఓటర్ల సర్వే చురుగ్గా సాగుతోంది. ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్నారు. ఇంటినంబర్ సున్నా(0)గా నమోదైన ఓటర్లను గుర్తిస్తున్నారు. ఇంటినంబర్ స్థానంలో ఓటరు జాబితాలో స్టార్, యాష్ వంటి గుర్తులు నమోదైన వాటిని సరిదిద్దుతున్నారు. మృతుల ఓటర్లను నిర్ధారిస్తున్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయస్సు పూర్తయివారి నుంచి ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 21 నాటికి ఓటరు సర్వే ముగించాల్సి ఉండగా, జిల్లాలో 54 శాతం పూర్తయింది. గడువు తేదీకి శతశాతం పూర్తిచేయాలన్న లక్ష్యంతో బీఎల్‌ఓలు ముందుకు సాగుతున్నారు.

ఆన్‌లైన్ ఓటర్ల నమోదుపై సర్వే

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,17,589 ఓటర్లు ఉండగా, ఇందులో ఇంటి నంబర్ '0' (సున్నా)గా ఉన్నవి, ఇంటి నంబరు లేనివి, జంక్ క్యారెక్టర్స్‌లో నమోదైనవి 17,166 ఓట్ల వరకు ఉన్నాయి. వీటితోపాటు ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదుకు దరఖాస్తు చేసుకున్న 83,853 మంది అడ్రస్‌లు ఖరారు చేయాల్సి ఉంటుది. అత్యధికంగా రాజాం (ఎస్సీ) నియోజకవర్గంలో 17,514 మంది యువత్ ఆన్‌లైన్‌లో ఓటుహక్కుకోసం దరఖాస్తు చేయగా, ఎస్.కోట నియోజకవర్గంలో 13,889 మంది, విజయనగరం నియోజకవర్గంలో 13,427 మంది, అత్యల్పంగా బొబ్బిలి నియోజకవర్గంలో 8,275 మంది దరఖాస్తు చేశారు. మాన్యువల్‌గా మండల కేంద్రాల్లో నమోదు చేసిన ఓటర్ల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదైన ఓటర్లు:

నియోజకవర్గం	ఓటర్లు మొత్తం	ఆన్‌లైన నమోదు ఓటర్ల
రాజాం	2,21,386	17,514
బొబ్బిలి	2,25,874	8,275
చీపురుపల్లి	2,01,130	10,420
నెల్లిమర్ల	2,07,353	10,064
గజపతినగరం	2,01,860	10,264
విజయనగరం	2,40,649	13,427
ఎస్.కోట	2,19,337	13,889
మొత్తం	15,17,589	83,853

15 రోజుల సర్వేలో ఎక్కడా కనిపించని దొంగ ఓటు

వైఎస్సార్‌సీపీ దొంగ ఓట్లు నమోదు చేయిస్తోందంటూ తెలుగుదేశం, జనసేన పార్టీలు చేస్తున్న ప్రచారం అసత్యమని తెలిపోయింది. ఒకే ఇంటి నంబరులో వందల సంఖ్యలో ఓట్లు ఉన్నాయంటూ గగ్గోలు పెడుతుండగా అదంతా గోబెల్స్ ప్రచారమని స్పష్టమవుతోంది. దేశ వ్యాప్తంగా ఓటర్ల సర్వే కార్యక్రమం గత నెల 21న ప్రారంభమైంది. దీనిలో భాగంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓ) ఇంటింటా తిరుగుతూ ఓటర్ల సర్వే చేస్తున్నారు. సర్వే ఈ నెల 21తో పూర్తి కావాల్సి ఉండగా ఎక్కడా అవకతవకలకు ఆస్కారం చేకుండా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గత 15 రోజులుగా నిర్వహించిన సర్వేలో ఎక్కడా దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించిన దాఖలాలు లేవు. అయితే, మున్సిపాలిటీల్లో ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉండటంతో వాటిని దొంగ ఓట్లుగా ప్రతిపక్ష పార్టీలు చిత్రీకరించాయి. అధికారుల పరిశీలనలో అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు అన్నింటికీ ఒకే ఇంటి నంబర్ ఇవ్వడమే ఇందుకు కారణమని తెలిసింది. ఒక అపార్ట్‌మెంట్‌లో సాధారణంగా 40 ఫ్లాట్లు ఉండగా, వాటిలో సుమారు 180 వరకు ఓట్లు ఉన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్స్ అన్నింటికీ ఒకే డోర్ నంబర్ ఇవడంతో ఒకే నంబర్‌తో ఎక్కువ ఓట్లు నమోదయ్యాయి. వీటిని దొంగ ఓట్లుగా ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నట్టు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో కొన్నిచోట్ల మరణించిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారి ఓట్లు మినహా దొంగఓట్లు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

సరిదిద్దుతున్న అంశాలు

ఇంటి నంబర్ 0 (సున్నా)గా ఉన్నవి, ఇంటి నంబర్ లేనివి, జంక్ క్యారెక్టర్స్‌తో నమోదైన వాటిని సరిదిద్దేందుకు జిల్లా ఎన్నిక యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఓటరుకు సంబంధించి ఇంటి నంబర్ ఆధారం (ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, తదితర కార్డులు) నకలు తీసుకుని ఫారం-8 ద్వారా సరిచేస్తున్నారు.

నేటి నుంచి ఓటరు జాబితా సవరణ

- ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21వ తేదీ వరకు బూత్ లెవల్ అధికారు (బీఎల్‌ఓ)లు ఇంటింటికీ వెళ్లి జాబితా మేరకు ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు.
- వచ్చేనెల 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణ పనులు నిర్వర్తించాలి.
- సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.
- ఓటరు జాబితా సవరణపై క్లైమ్‌లు, అభ్యంతరాలను అక్టోబర్ 17 నుంచి నవంబరు 30వ తేదీ వరకు స్వీకరిస్తారు.
- డిసెంబర్ 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు.
- 2024 జనవరి 1న ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు.
- 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

జిల్లాలో ఓటర్ల సర్వే పారదర్శకంగా జరుగుతోంది. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి దొంగఓట్లు ఉన్నట్లు గుర్తించలేదు. అయితే, కొన్నిచోట్ల ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉన్నట్టు గుర్తించడంతో వాటిపై ఆరా తీసాం. అక్కడ అనేక ఇళ్లకు ఒకే ఇంటి నంబర్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. ఓటర్ల జాబితా తయారీ కోసం ఆయా ఇళ్లకు తాత్కాలిక ఇంటి నంబర్ ఇచ్చి ఓట్లు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించాం.

– ఎం.గణపతిరావు, డీఆర్వో, విజయనగరం

మరో ఐదు రోజులే గడువు

- నిర్ణీత కాలవ్యవధిలో ఓటర్ల జాబితా సవరణ
- రాజకీయపార్టీ ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్నకలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు కేవలం ఐదు రోజులే గడువు ఉందని, ఆ లోగా సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఇంటింటి సర్వేపై నియోజకవర్గాలు, మండలాల వారీగా సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, అనర్హులందరి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓటు తొలగించేటప్పుడు తప్పనిసరిగా ఫారం-7 తీసుకోవాలని, డెత్ సర్టిఫికేట్ లేదా ఏదో ఒక ధ్రువీకరణ పత్రం ఫైల్‌చేయాలన్నారు. ఒక కుటుంబం, ఒక అపార్ట్‌మెంట్ లేదా గ్రూప్ హౌస్‌లో నివసించేవారి ఓట్లు అన్నీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా రేషనలైజేషన్ చేయాలన్నారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగుతోందని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేని, కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీఓలు ఎం.ఇ.సూర్యకళ, ఎం.అప్పారావు, శేషశైలజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుదర్శనదొర, సూక రాజు, పద్మలత, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలిపోతన్న, సతీష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, దయానంద్, నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.



గుంకలాం వైఎస్సార్‌జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల జోరు

● ఇళ్ల కళ



కాలనీలో విద్యుత్ సదుపాయం ఇలా...

విజయనగరం పట్టణంలోని పేదలందరికీ పక్కా ఇంటి భాగ్యం కల్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుంకులాం వద్ద 394.06 ఎకరాల్లో రాష్ట్రంలోనే అతిపెద్ద వైఎస్సార్ జగనన్నలే అవుట్‌ను వేసింది. వీటిలోని 12,216 ఇళ్లస్థలాలు ఉండగా, 11,091 స్థలాలను తొలిదశలో పేదలకు కేటాయించింది. 10,625 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసింది. కాలనీకి దశలవారీగా విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడం, లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ సామగ్రిని రాయితీపై సమకూర్చుతుండడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. పేదల కోసం ఓ పెద్ద ఊరు చకచకా నిర్మితమవుతోంది. కనుచూపు మేర సాగుతున్న ఇళ్లనిర్మాణాలు.. చూసిన వారికి ముచ్చటగొల్పుతున్నాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

అమ్మో పులి..!

- భయాందోళనలో ఏజెన్సీ ప్రజలు
- చిన్నదిమిలి వద్ద పులి పాదముద్రలు గుర్తింపు
- పులి జాడను నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- గ్రామాల్లో అప్రమత్తం చేస్తున్న పోలీస్‌లు



చిన్నదిమిలి వద్ద పులి సంచారంపై ఆరా తీస్తున్న అటవీశాఖ అధికారులు

భామిని: ఏజెన్సీలో పులి సంచారం అలజడి రేపుతోంది. ఏనుగుల భయం వీడిందనేసరికి పులి సంచారంతో ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. భామిని మండలం చిన్నదిమిలి-పెద్దిదిమిలి గ్రామాల సమీపంలో బుధవారం పులి పాదముద్రలను స్థానికులు గుర్తించారు. చిన్నదిమిలి క్వారీ సమీపంలో మంగళవారం రాత్రి వింత జంతువు అలికిడి గుర్తించినట్టు వాచ్‌మన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పాలకొండ ఫారెస్ట్ రేంజర్ తవిటినాయుడు ఆధ్వర్యంలో కొత్తూరు సెక్షన్ అధికారి కృష్ణారావు, అటవీశాఖ సిబ్బంది చిన్నదిమిలి సమీపంలో పులిసంచరించే ప్రాంతాన్ని పరిశీలించారు. పులి పాదముద్రలుగా నిర్ధారించారు. భామిని, సీతంపేట, కొత్తూరు మండలాల ప్రజలు అప్రతమత్తంగా ఉండాలని తవిటినాయుడు హెచ్చరికలు జారీ చేశారు. వేకువ జామున బయటకు వెళ్లే రైతులు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బత్తిలి పోలీసుల ఆదేశాల మేరకు వీఆర్వో వినోద్‌కుమార్, ఏఎస్సై గురుమూర్తి, సర్పంచ్ రవికుమార్‌లు గ్రామాల్లో దండోరా వేయించారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నాయుడు



క్రీడాకారుడికి స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

శృంగవరపుకోట: శ్రీలంక రాజధాని కొలంబోలో ఈ నెల 19 నుంచి జరగనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎస్.కోటకు చెందిన పి.ఎస్.నాయుడు ఎంపికయ్యాడు. ఆయనను జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు బుధవారం అభినందించారు. స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. ఇటీవల ఖరగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోల్‌వాల్ట్‌లో 35-40 సంవత్సరాల విభాగంలో పాల్గొన్న సన్యాసినాయుడు ప్రథమస్థానం సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు రఘురాజు చెప్పారు. విజయనగరంలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాయుడు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఓటు అడిగే హక్కు మనకే ఉంది



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లాకు చంద్రబాబు చేసిన మేలు శూన్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: ప్రజలవద్దకు వెళ్లి ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాత్రమే ఉందని, నాలుగేళ్లలో మన ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి ధైర్యంగా చెప్పగలుగుతున్నామని జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఏ నాయకుడైనా ఓ జిల్లాకు వెళ్లినప్పుడు మేం ఇక్కడ చేసిన పనులివి! చేయబోయే పనులివి!! అని చెప్పుకుంటాడని, మొన్న జిల్లాకు చంద్రబాబు వచ్చినప్పుడు కొన్ని చోట్ల ఆగకుండా వెళ్లిపోయాడని, ఆయన హయాంలో ఏం చేశారో చెప్పుకోలేక అధికార పార్టీ నేతలపై విమర్శలకు పరిమితమవుతున్నారని విమర్శించారు. బొబ్బిలి పట్టణంలోని ఓ ప్రైవేటురెసిడెన్సీలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి, సీతానగరం ప్రజలు ప్రశ్నిస్తారన్న భయంతో చంద్రబాబు ఆగకుండా వెళ్లిపోయాడన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చెరకు రైతుల బకాయిలు, ఉద్యోగుల వేతనాలు ఎన్‌సీఎస్ నుంచి చెల్లించే చర్యలు చేపట్టామన్నారు. తెర్లాం ప్రాంతంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సొంత నిధులతో కాలువలు తవ్వించారని రైతులే స్వయంగా చెబుతున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు

బీమా కోసం యాప్‌లో అప్‌లోడ్ చేయాలి!

గృహ సారథులందరూ రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల బీమా పరిహారం కోసం యాప్‌లో వివరాలను నమోదు చేయాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. ఇది జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం కనుకు ఈ నెల 11 నుంచి 19వ తేదీలోగా నమోదును పూర్తిచేయాలన్నారు.

బొబ్బిలి రాజులు అడుగు పెట్టలేరు!

బొబ్బిలి రాజులు పదవుల కోసం పార్టీలకు వెన్నుపోటు పొడిచివెళ్లిపోయి ఏం సాధించారని మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. పాలన చేతకాక ఒక్క పనీ చేయలేకపోయారన్నారు. నాలుగు కంకర పోగుల వద్ద సెల్ఫీలు తీసుకోవడం గొప్పకాదన్నారు. ఎమ్మెల్యే చేసిన పనులు, ప్రభుత్వ పనులు చూపిస్తూ మేం సోషల్ మీడియాలో పోస్టులు పెడితే మీరు ఒక్క గ్రామంలోనూ తిరగలేరని స్పష్టంచేశారు. నియోజకవర్గ పరిశీలకుడు పరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి హయాంలో పార్టీ, కులాలు లేకుండా లక్ష కోట్ల పథకాలు అమలు చేస్తే, చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలకే ప్రయోజనాలు దక్కాయన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ బొబ్బిలి నుంచి వచ్చే ఎన్నికల్లో గత మెజారిటీ కన్నా అధిక మెజారిటీతో గెలుస్తానన్నప్పుడు సభికులు హర్షధ్వానాలు మిన్నంటాయి. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, బుడా చైర్‌పర్సన్ ఇంటి పార్వతి, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యులు తూముల భాస్కరరావు, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు బొబ్బిలి రైల్వే ఎస్సై రవివర్మ, కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్తున్న రైలు నుంచి జారి పడడంతో మృతదేహం ముక్కలు, ముక్కలైందని, వివరాలు తెలియరాలేదని, ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9441013330 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఊబిలో చిక్కుకుని రెండు ఎద్దులు..

శృంగవరపుకోట: మండలంలోని గోస్తనీ నదిలో చిక్కుకుని రెండు ఎద్దులు ప్రాణాలు వదిలాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం నాలుగుగంటల సమయంలో గోస్తనీ నదిలో ఇసుక కోసం దిగిన ఎద్దులబండి ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కుకుపోయింది. దీంతో బండిపై ఉన్న అచ్చిబాబు కేకలు వేయగా స్థానికులు వచ్చి ఊబిలో కూరుకుపోయిన ఎద్దులను బయటకు తీశారు. అయితే అప్పటికే ఎద్దులు రెండూ మరణించాయి. ఎద్దులు రెండూ అక్కడికక్కడే చనిపోవడంతో అచ్చిబాబు ఏడుస్తూ స్పృహ కోల్పోయాడు. వర్షం లేక ఏరు పారని సమయంలో ఇసుక కోసం గోతులు తీశారని, ఏరు పారిన తర్వాత గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక మూగజీవాలు ప్రమాదాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల జామి మండలం తానవరంలో ఇదే తరహా ఘటన సంభవించింది. కొంత మంది అత్యాశకు పోయి ఇష్టానుసారం గోతులు తీయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

దాబా దగ్ధం

- రూ.లక్షా 80వేల ఆస్తినష్టం



కాలిబూడిదైన దాబా

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం సమీపంలో గల లైట్‌హౌస్ దాబా మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో కాలిబూడిదైంది. ఈ ఘటనపై ఎస్సై వీరజనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి దాబాను చుట్టుముట్టడంతో కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందజేయగా సిబ్బంది వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిందని, సుమారు రూ.లక్షా, 80వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని, ఫైర్ ఆఫీసర్ వై.అశోక్‌కుమార్ అంచనా వ్యక్తం చేశారు. అయితే అగ్నిప్రమాదంపై అనుమానాలు ఉన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై వీరజనార్దన్ బుధవారం సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూతికవలసలో పశువులశాల..

మెరకముడిదాం: మండలంలోని పూతికవలస లో గ్రామానికి చెందిన రైతు విశాఖరామారావు పశువుల శాల బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదంలో కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి

విజయనగరం టౌన్: పట్టణంలోని బొండాడవీధిలో కొలువైన మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆగష్టు 17 నుంచి ప్రతి శుక్రవారం శ్రీచక్ర సహస్ర కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు దేవాలయం పాలక మండలి అధ్యక్షుడు సోమరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి వచ్చేనెల 15 వరకు శ్రావణమాస పూజలు చేయనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

ముఖ్యమంత్రిది మేలైన పాలన

- వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి
- మాటలతో ప్రతిపక్ష నేత చంద్రబాబు కాలక్షేపం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పైప్‌లైన్‌ల ప్రారంభోత్సవంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ తదితరులు

విజయనగరం: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మాటలతో కాలక్షేపం చేసే నాయకుడైతే..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చేతలతో మేలైన పాలన అందిస్తున్నారని, అటువంటి యువ నేతకు మరింత మద్దతిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విజయనగరంలోని 28వ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో తాగు నీటిని అందించేందుకు రూ.58 లక్షలతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు, తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని చంద్రబాబు అండ్ టీడీపీ టీమ్ తెల్లవారు లేచినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏవిధంగా అభాసు పాలు చేయాలని చూస్తున్నారే తప్ప.. వారి హయాంలో జరిగిన మోసపూరిత పాలనపై ఎందుకు పెదవి విప్పడం లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన డ్వాక్రా రుణాల మాఫీ హామీని అమలు చేయలేకపోయారని విమర్శించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ ఆసరా పేరిట డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తున్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను వేలెత్తి చూపించే అర్హత టీడీపీ లేదన్నారు. అటువంటి ముఖ్యమంత్రి నేతృత్వంలో పనిచేయడం తనకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహామండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ జకీర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రహదారి విస్తరణ పనులపై చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

రాజీవ్ నగర్ వాసుల హర్షం

1989–94 మధ్యకాలంలో దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు చొరవతో స్థానిక నాయకుల కృషి వల్ల ఏర్పడిన రాజీవ్‌నగర్ కాలనీ వాసుల తాగునీటి కష్టాలకు తెరపడింది. ఎన్నికలకు ముందు కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన హామీ మేరకు కాలనీలో రూ.58 లక్షలతో పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావడంతో స్థానికులు హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

అమ్మవారి జాతరలోగా రోడ్డు విస్తరణ

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం అభివృద్ధిలో భాగంగా రోడ్లు విస్తరణ పనులు చేపడుతున్నాం. విజయనగరంలోని మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర సమయానికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు ఈ మేరకు బుధవారం నగరంలోని ఆ ప్రాంతంలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. రహదారి మధ్యలో డివైడర్లు వేస్తున్న పరిస్థితిని గమనించారు. రహదారి విస్తరణ జరిగిన అనంతరం ప్రజలకు ఎటువంటి అసౌకర్యంగా లేకుండా అవసరమైన తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, యడ్ల రాజేష్, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘పైడితల్లి’ హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ కేఎల్.సుధారాణి తదితరులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు హుండీల ఆదాయం లెక్కింపును స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయంలోని కల్యాణ మంటపంలో అధికారుల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి మాట్లాడుతూ అమ్మవారి వనంగుడి, చదురుగుడి హుండీల నుంచి 77 రోజులకు గాను వనంగుడి నుంచి రూ.6 లక్షల 25వేల 224 నగదు, 3 గ్రాముల బంగారం, 176 గ్రాముల వెండి లభించాయన్నారు. అదేవిధంగా చదురుగుడి హుండీల నుంచి రూ.27 లక్షల 46వేల 569 నగదు, 34.180 గ్రాముల బంగారం, 271 గ్రాముల వెండి లభించాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కార్ట్ లేకుండానే హుండీల తరలింపు

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ముందుగా చదురుగుడి హుండీలను కల్యాణ మంటపానికి తీసుకువస్తారు. అలా కాకుండా రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి హుండీలను మూటలుగా కట్టి ప్రైవేట్ వ్యాన్‌ద్వారా ఎటువంటి పోలీస్ ఎస్కార్ట్ లేకుండా దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బందితోనే చదురుగుడికి తరలించారు. ట్రస్ట్ బోర్డు మెంబర్లు, స్థానికులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జరగరానిదేదైనా జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చదురుగుడి, వనంగుడిల నుంచి హుండీలు తరలిస్తున్న సమయంలో పోలీసు ఎస్కార్ట్ లేకపోవడమేంటని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడం తగదన్నారు. ఈ విషయమై జిల్లా సహాయక కమిషనర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పోలీసులకు ముందుగానే సమాచారమిచ్చామని, వారు వచ్చేందుకు సమయం ఆలస్యమవ్వడంతో ఎప్పటిలానే తనతో పాటు దేవాదాయశాఖ అధికారులతో కల్యాణ మంటపానికి తీసుకువచ్చామన్నారు. ఎటువంటి అవకతవకలు జరగలేదని, అన్నీ పక్కాగానే ఉన్నాయని చెప్పారు. వచ్చే నెల నుంచి చేపట్టబోయే హుండీల లెక్కింపులన్నీ పోలీస్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఎక్కడికక్కడే చేపట్టనున్నామని తెలిపారు. ప్రతి బ్యాగ్‌కు సీల్ వేయిస్తామని, ట్యాంపరింగ్ చేయడానికి అవకాశం లేదని వివరించడంతో ట్రస్ట్ బోర్డు సభ్యులు శాంతించారు.



ట్రస్ట్ బోర్డు సభ్యులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ జిల్లా సహాయక కమిషనర్ అన్నపూర్ణ

దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్‌ఇండియా లక్ష్యం

- ప్రొఫెసర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య

విజయనగరం: దేశ సర్వతోముఖాభివృద్ధి లీడ్‌ఇండియా ముఖ్య ఉద్దేశమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.బి.సుదర్శన్ ఆచార్య పేర్కొన్నారు. యువతకు లీడ్ ఇండియా ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఉత్తేజవంతమై అన్ని రంగాలలో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రభుత్వం, రోటరీ క్లబ్ సహకారంతో ఉచితంగా నిరుద్యోగ యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఉమామహేష్ మాట్లాడుతూ 'నీ అభివృద్ధే దేశాభివృద్ధి' అనే నినాదంతో ఈ శిక్షణ అనంతరం నిరుద్యోగ యువతకు లీడ్ ఇండియా ట్రైనర్స్‌గా గౌరవ వేతనంతో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, ముఖ్య సలహాదారు, ఆడిటర్ బాలాజీ, సమన్వయ కర్త జ్ఞానేశ్వర్ గురూజీ, యోగా గురువు శశిభూషణ్ గురూజీ, రామ్మూర్తి, హేమసుందర్, శ్రీనివాస్, కుమారస్వామి, వింధ్య, శిక్షకులు శ్రీనివాసచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువత హాజరయ్యారు.

అనారోగ్యంతో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి

- ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు



ప్రసాద్ మృతదేహం వద్ద తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె.నీలకంఠం



శ్మశాన వాటికవద్ద గౌరవ వందనం చేస్తున్న బీఎస్‌ఎఫ్ అధికారులు



నగర ప్రసాద్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ నగర ప్రసాద్(44) అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ఆస్పత్రిలో మంగళవారం మృతిచెందారు. ప్రసాద్ మృతదేహాన్ని సాయంత్రం స్వగ్రామం చినభోగిలికి కుటుంబీకులు తీసుకొచ్చారు. బుధవారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో బోర్డర్ సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొని అధికారిక లాంఛనాలతో నిర్వహించి వీడ్కోలు పలికారు. ముందుగా ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం శ్మశాన వాటిక వద్ద బీఎస్‌ఎఫ్‌కు చెందిన కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, సిబ్బంది పాల్గొని ఆయన భార్యకు జాతీయ పతాకాన్ని అందజేశారు. గార్డు ఆఫ్ హానర్ కార్యక్రమాన్ని నిర్వహించాక అంత్యక్రియలు పూర్తిచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీరమణ, ఎస్సై కె.నీలకంఠం, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, సర్పంచ్ కురమాన రాధ, గ్రామ వీఆర్‌ఓ ఎస్ లక్ష్మి, కుటుంబ సభ్యులు,స్నేహితులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల రోదన

ప్రసాద్ గుజరాత్ రాష్ట్రంలోని పనిచేస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. 23ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రసాద్ సెలవుపై జూలై 30న ఇంటికి చేరుకున్నారని భార్య తెలిపారు. మృతి చెందిన ప్రసాద్‌కు తల్లిదండ్రులు గంగయ్య, సీతమ్మతో పాటు భార్య పవిత్ర, కుమారుడు అక్షయ్ కుమార్, కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషిస్తున్న ప్రసాద్ మృతిచెందడాన్ని జీర్ణించుకోలేకోపోయిన కుటుంబసభ్యులు భోరున విలపించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు కానుక

- క్రమబద్ధీకరణకు ఐదేళ్ల నిబంధన తొలగింపు

విజయనగరం అర్బన్: కాంట్రాక్ట్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ కానుక ప్రకటించారు. కొన్ని నిబంధనలు తొలగించి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేయడంపై వైద్యారోగ్య పారామెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ హర్షం వెలిబుచ్చింది. ఈ మేరకు కమిటీ ప్రతినిధి వీవీఎస్‌ఆర్ ప్రసాద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గత క్యాబినెట్‌లో తీర్మానం చేశారని, అయితే వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 5 సంవత్సరాల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ ప్రకారం 2014 జూన్ 2 ముందు నియమితులై, ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి స్వాతంత్ర్య దినోత్సవం రోజు సంతకం చేశారని, ఉత్తర్వులు త్వరలో వెలువడతాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీలో 78 మద్యం సీసాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంబాటిల్స్, స్కూటీతో ఎస్సై రాజేష్

గరుగుబిల్లి: వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో అక్రమంగా తరలిస్తున్న వాహనాలను, 78 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ బుధవారం తెలిపారు. దళాయివలస జంక్షన్‌లో వాహనాల తనిఖీచేస్తున్న సమయంలో దళాయివలసకు చెందిన ఒక వ్యక్తి దగ్గర ఎనిమిది మద్యం బాటిల్స్, బీవీ పురానికి చెందిన ఇద్దరు వ్యక్తుల దగ్గర 30 బాటిల్స్, ఒక ద్విచక్ర వాహనం, ఉల్లిభద్ర గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి 28 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే వంగర మండలం బంగారువలసకు చెందిన ఒకరు 12 మద్యం బాటిల్స్, రవాణాకు వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదుచేసి మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సీతంపేటలో 15 మద్యం బాటిల్స్..

సీతంపేట: సీతంపేటలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తినుంచి 15 మద్యం బాటిల్స్ బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న షాపులో మద్యం విక్రయిస్తున్న బి.నారాయణరావును కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై చెప్పారు.

ప్రాధాన్య భవనాల నిర్మాణం పూర్తిచేయాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: నిర్మాణాలు పూర్తి కావస్తున్న భవనాల చివరి దశ పనులను పూర్తిచేసి పది రోజుల్లో అప్పగించాలని ఇంజినీరింగ్ అధికారులను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రాధాన్యతా భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 14నాటికి నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవనాలను ఇంతవరకు అప్పగించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పురోగతిపై నిర్లక్ష్యం వహించిన ఇంజినీర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు కోరిన పనులకు రూ.36 కోట్లు మంజూరుచేశామని, ఇంతవరకు రూ.4కోట్లతో మాత్రమే పనులు చేపట్టారని, పనులను వేగవంతం చేసేందుకు సర్పంచ్‌లు, టెక్నికల్ సహాయకులతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు తయారు చేసి, ఈనెలాఖరుకు 25 శాతం పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పీఆర్ ఎస్ఈ ఎంవీఆర్ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ఆగి ఉన్న ఆటోను వెనుకనుంచి లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ వాసిరెడ్డి వెంకటనాయుడు పార్వతీపురం నుంచి కాశీపేటకు నలుగురు పాసింజర్లను ఎక్కించుకుని వెళ్తూ నర్సిపురం సమీపంలో విజయబ్యాంకు దగ్గర పాసింజర్‌ను దింపేందుకు ఆటో ఆపాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ వెనుకనుంచి ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడడంతో పాటు ప్రయాణికులకు పలు చోట్ల గాయాలయ్యాయి. గాయాల పాలైన ప్రయాణికులను 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. గాయాలపాలైన వారిలో బంగారంపేటకు చెందిన తాన్న వాసు, వైకేఎం కాలనీకిచెందిన ఎస్.రాజేశ్వరి, పి.జానకి, బరదవెంకటాపురానికి చెందిన పల్లా లక్ష్మితో పాటు ఆటో డ్రైవర్ వాసిరెడ్డి వెంకటనాయుడులున్నారు.

రెండు బైక్‌లు ఢీ కొని ఇద్దరికి..

మక్కువ: మండలంలోని కొండబుచ్చెంపేట గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. శంబర గ్రామానికి చెందిన నైదాన సాయి కృష్ణ మక్కువ నుంచి శంబర వెళ్తుండగా మక్కువ–దుగ్గేరు రహదారి నుంచి శంబర గ్రామానికి చెందిన బోను లోకేష్ బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొని గాయాలపాలయ్యారు. సాయికృష్ణకు కుడి కాలు విరిగిపోగా, కుడి భుజానికి గాయాలయ్యాయి. లోకేష్‌కు కుడి కాలికి గాయం కాగా, ఇద్దరినీ చికిత్స నిమిత్తం మక్కువ పీహెచ్‌సీకి స్థానికులు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయనగరం లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు.



గాయాలపాలైన సాయికృష్ణ, లోకేష్

పీహెచ్‌సీల పోటీ

- ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఉంటే రూ.3 లక్షల ప్రోత్సాహకం



ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ సాధించిన బాడంగి మండలంలోని వాడాడ పీహెచ్‌సీ

విజయనగరం ఫోర్ట్: నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్వాష్) సర్టిఫికెట్ కోసం జిల్లాలోని పీహెచ్‌సీలు పోటీపడుతున్నాయి. ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ వచ్చిన పీహెచ్‌సీలకు ప్రభుత్వం ప్రోత్సాహకం ఇస్తుండడంతో జిల్లాలోని పీహెచ్‌సీలు ఆ సర్టిఫికెట్ సాధించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకంతో ఆస్పత్రి అభివృద్ధి చేసుకోవడంతో సిబ్బంది కూడా ప్రోత్సాహకంలో 25 శాతం వినియోగించుకోవచ్చు. నాణ్యమైన సేవలు అందించే పీహెచ్‌సీలకు మాత్రమే ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఇస్తారు.


ఆరు అంశాల ఆధారంగా సర్టిఫికెట్

పీహెచ్‌సీకి ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఆరు అంశాల అధారంగా జారీ చేస్తారు. ఆపరేషన్ థియేటర్, కాన్పుగది నిర్వహణ, ఇన్‌పేషెంట్ సేవలు, ల్యాబొరేటరీ సేవలు, నేషనల్ హెల్త్ కార్యక్రమాలు, జనరల్ అడ్మినిస్ట్రేటివ్ అధారంగా ఎన్‌క్వాష్ సర్టిపికెట్ మంజూరవుతుంది. జిల్లాలో 48 పీహెచ్‌సీలు ఉండగా వాటిలో 21 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ ఇప్పటికే వచ్చింది. మిగిలిన 27 పీహెచ్‌సీలు సర్టిఫికెట్ కోసం ప్రయత్నిస్తున్నాయి.

సర్టిఫికెట్ సాధించిన పీహెచ్‌సీలు

పక్కి, రామభద్రపురం, బొద్దాం, గంట్యాడ, పెదమజ్జిపాలెం, పూసపాటిరేగ, పోలిపల్లి, పెరుమాళి, తెర్లాం, మందాకురిటి, డెంకాడ, ఆర్.ఆమదాలవలస, పిరిడి, గుర్ల, గర్భాం, పొగిరి, వేపాడ, వాడాడ, గరివిడి, సతివాడ, సంతకవిటి ఉన్నాయి.

సర్టిఫికెట్‌తో నిధులు



జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీలు ఎన్‌క్వాష్ సర్టిఫికెట్ సాధించేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 21 పీహెచ్‌సీలు సాధించాయి. సర్టిఫికెట్ వల్ల వచ్చే నిధులతో పీహెచ్‌సీ అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ